# బీఆర్ఎస్ గెలిస్తే బతుకులు బాగుంటయ్

- వలసల నుంచి పనులు ఇచ్చేస్థాయికి చేరాం
- రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌దే
- జగిత్యాల అభ్యర్థి సంజయ్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించండి
- మరింత ఆదర్శంగా తీర్చిదిద్దుతం.. అల్లీపూర్‌ను మండలంగా చేస్తం
- జగిత్యాల నియోజకవర్గం రోడ్డు షోలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



రోడ్ షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చిత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్

### బీఆర్ఎస్ ఎప్పుడూ ప్రజలతోనే ఉన్నది

చెరువులు ఎండిపోయినప్పుడు కప్పలు చెరువును విడిచిపెట్టి వెళ్లిపోతయి. చేపలు మాత్రం చెరువు నిండినా ఎండినా అక్కడే ఉంటయి. బీఆర్ఎస్ వాళ్లు చేపల్లాంటి వాళ్లు. కాంగ్రెస్, బీజేపీ వాళ్లు కప్పల వంటి వాళ్లు. చెరువులు ఎండిన నాడు ప్రజలతో బీఆర్ఎస్ ఉన్నది. ఇప్పుడు చెరువులు నిండిన సమయంలో సైతం ప్రజలతోనే ఉన్నది. కష్టంలో ఉన్నప్పుడు మనతో ఉంటేనే మనవాడు అవుతడు. సంతోషంగా ఉన్నప్పుడు, సంపద ఉన్నప్పుడు మన వెంటే ఉండేవాళ్లు మనవాళ్లు కాదు.

**- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

### సంజయ్ కుమార్‌ను గెలిపించండి

జగిత్యాలలో బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కుమార్ ప్రజాసేవ లక్ష్యంగా పనిచేస్తున్నడు. డాక్టర్‌గా ఉన్నా, ప్రజాప్రతినిధిగా ఉన్నా ఎప్పుడూ ఒకేవిధంగా ఉన్నడు. ప్రజలు ఓడించినా, గెలిపించినా ఆయన ప్రజల వెంటే నడుస్తున్నడు. కార్తీకదీపం సీరియల్‌లో ఉన్న డాక్టర్ బాబులాగా, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ బాబు సైతం మంచివాడు. ఆయనకు ప్రజలు మద్దతు పలుకాలి. భారీ మెజార్టీతో గెలిపించాలి.

**- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

జగిత్యాల, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): 'బతుకుదెరువు కోసం వలస పోయిన తెలంగాణ ప్రాంతంలోకి, నేడు బతుకుదెరువు కోసం ఇతర రాష్ట్రాల వాళ్లు వలస వచ్చే పరిస్థితి వచ్చింది. నేడు మన పొలాల్లో నాట్లు వేసేందుకు, కోతలు కోసేందుకు, బిహార్, బెంగాల్, ఉత్తర ప్రదేశ్ లాంటి రాష్ట్రాల నుంచి ప్రజలు వస్తున్నరు. అంటే మన రాష్ట్రం ఎంతగా అభివృద్ధి చెందిందో గుర్తించాలి. బీఆర్ఎస్ గెలిస్తే ప్రజల బతుకులు బాగుంటయ్' అని నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ చెప్పినవన్నీ చేశారని, కాంగ్రెస్, బీజేపీ వాళ్లు మాటమీద నిలబడేవాళ్లు కాదన్నారు. ఆ పార్టీలను గెలిపిస్తే ఆ పార్టీలే గెలుస్తాయని, బీఆర్ఎస్ గెలిస్తే ప్రజలు గెలుస్తారని, ప్రజల బతుకులు బాగుంటాయని చెప్పారు. జగిత్యాల ఎమ్మెల్యేగా డాక్టర్ సంజయ్ కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కారు గుర్తుపై ప్రజలు గుద్దుడు గుద్దితే ఈవీఎం మిషన్లు దద్దరిల్లాలన్నారు. జగిత్యాల బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్‌కు మద్దతుగా రాయికల్ మండలం మైతాపూర్, ఇటిక్యాల, భూపతిపూర్, తాట్లవాయి, కట్కాపూర్, బీర్‌పూర్, అల్లీపూర్, జగిత్యాల పట్టణాల్లో శనివారం నిర్వహించిన రోడ్డుషోల్లో ఎమ్మెల్సీ ఎల్ రమణ, జడ్పీ చైర్‌పర్సన్ వసంతతో పాల్గొని, మాట్లాడారు. తెలంగాణ ప్రాంతంలో ఒకప్పుడు నీటి వసతి లేక, ప్రభుత్వాలు పట్టించుకోక ప్రజలు దుబాయ్, ముంబై లాంటి ప్రాంతాలకు వలసలు పోయారన్నారు. కానీ, నేడు తెలంగాణ వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం రూపురేఖలు మారిపోయాయన్నారు. గ్రామాల్లో చెరువులు నీళ్లతో కళకళలాడుతున్నాయని, కాలువల్లో నీళ్లు పారుతున్నాయని, 24 గంటల విద్యుత్ వస్తున్నదని, ఎక్కడ చూసినా ధాన్యం కుప్పలు కనిపిస్తున్నాయన్నారు. ఒకప్పుడు పనిలేక, వలసలు పోయిన తెలంగాణ ప్రాంతం నేడు ఇతరులకు పని కల్పిస్తున్నదన్నారు. బిహార్, బెంగాల్, ఉత్తర ప్రదేశ్, ఒడిశా తదితర 16 రాష్ట్రాల నుంచి బతుకుదెరువు కోసం వస్తున్నారని గుర్తు చేశారు. తెలంగాణ విభజన సమయంలో రాష్ట్రం ఏర్పడితే చీకట్లు అలుముకుంటాయని, నీళ్లు రావని, కరువు ఉంటుందని, నక్సలైట్ల రాజ్యం అవుతుందంటూ ఆంధ్రా ప్రాంతం వాళ్లు విమర్శలు చేశారని, అయితే పదేళ్ల పాలనలో సీఎం కేసీఆర్ తెలంగాణను దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దారన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేశారని, రైతుల కోసం రైతు బంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత విద్యుత్ లాంటి పథకాలను రూపొందించారన్నారు. మహిళల నేతృత్వంలో ఐకేపీ కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేసే పద్ధతిని ప్రారంభించామని చెప్పారు. గత పాలకులు ఒక్క గింజా అయినా కొనుగోలు చేశారా..? అని ప్రశ్నించారు. చరిత్ర మరిచిపోతే మళ్లీ ఆగమవుతామన్నారు. తెలంగాణ రాకముందు బీడీ కార్మికులను ఏ ప్రభుత్వాలు పట్టించుకోలేదని చెప్పారు. దేశంలో 16 రాష్ట్రాల్లో బీడీ కార్మికులే ఉన్నారని, ఎక్కడా లేని విధంగా బీడీ కార్మికులకు పెన్షన్లు ఇస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనని కొనియాడారు. రాష్ట్రంలో 2014ను ప్రామాణికంగా తీసుకొని బీడీ కార్మికుల పెన్షన్లకు కటాఫ్ డేట్ పెట్టామని, దీనివల్ల కొందరికి పెన్షన్లు రావడం లేదన్నారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లామని, కటాఫ్ డేట్ తీసివేసి అందరికీ పెన్షన్ ఇస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విపరీతంగా గ్యాస్ సిలిండర్ ధరలను పెంచిందని, తగ్గించాలని చెప్పినా ప్రధాని మోడీ అంకుల్ పట్టించుకోలేన్నారు. చెప్పిచెప్పి విసిగిపోయిన సీఎం కేసీఆర్, ఆడబిడ్డలకు ₹400కే సిలిండర్ ఇవ్వాలన్న నిర్ణయం తీసుకున్నారన్నారు. మిగిలిన ₹800ను రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి చెల్లిస్తుందన్నారు. భూమి ఉన్న రైతు కుటుంబాలకు రైతు బీమా ఇస్తున్నామని, అయితే భూమి లేని వారికి ఏంటన్న ప్రశ్న ఉత్పన్నమైందన్నారు. అందుకే కేసీఆర్ బీమా.. ప్రతి ఇంటికీ దీమా పేరిట ప్రతి పేద కుటుంబానికి బీమా సౌకర్యం కల్పించాలని నిర్ణయించామన్నారు. ఈ పథకాన్ని సీఎం కేసీఆర్ సంకల్పిస్తే, బీమా ఎందుకని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయని, అందరూ బాగుండాలనే ఈ కార్యక్రమాన్ని తీసుకున్నామన్నారు. బీఆర్ఎస్ గెలిస్తే ప్రజలకు మంచి భవిష్యత్తు బాగుంటుందని, తెచ్చుకున్న తెలంగాణను తెర్లు చేసుకోవద్దని, తెలంగాణను దొంగల చేతిలో పెట్టవద్దని కోరారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ వంద మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, కానీ, ఒక్కటి కూడా నెరవేర్చలేదని విమర్శించారు. జగిత్యాలలో కాంగ్రెస్ అభ్యర్థిగా జీవన్‌రెడ్డి తనకు ఆఖరి అవకాశం ఇవ్వాలని అంటున్నారని, అయితే ఆయనకు ఎన్నిసార్లు ఆఖరి అవకాశం ఇవ్వాలని ప్రశ్నించారు. రైతు రుణమాఫీ కాకుండా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది జీవన్‌రెడ్డినే అన్నారు. యువతకు ఉద్యోగాలు రావడం లేదంటూ, అబద్ధాలు ఆడుతూ, అభాండాలు వేస్తున్నది జీవన్‌రెడ్డినే అని మండిపడ్డారు.



రాయికల్ మండలం భూపతిపూర్ ఎక్స్ రోడ్ వద్ద రోడ్ షోకు హాజరైన ప్రజలు

రాయికల్ మండలంలోని అల్లీపూర్‌ను మండలం చేస్తామని కవిత హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ గౌడ్, ఎంపీపీ సంధ్యారాణి, జడ్పీటీసీ సభ్యురాలు జాదవ్ అశ్విని, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు కోల శ్రీనివాస్ పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పార్టీ తేలులాంటిది.. ఆకట్టుకున్న పిట్టకథ

భూపతిపూర్ ఎక్స్ రోడ్డు వద్ద రోడ్డుషోలో పాల్గొన్న కవిత చెప్పిన 'తేలు. కప్ప పిట్టకథ' అందరినీ ఆకట్టుకున్నది. చెరువులో నీరు లేని సమయంలో ఒక తేలు అందులో కాపురం ఉంది. అయితే చెరువులోకి నీరు రావడంతో తేలు బయటకు వెళ్లిపోవాలని అనుకున్నది. చెరువు మధ్య నుంచి ఒడ్డుకు ప్రయాణం మొదలు పెట్టింది. అయితే నీటిలో ప్రయాణం చేయడం తేలుకు ఇబ్బందిగా మారింది. అదే సమయంలో ఒక కప్ప తేలుకు కనిపించింది. తేలు కప్పను కలిసి తనను వీపుపై కూర్చోబెట్టుకొని ఒడ్డుకు చేర్చమని కోరింది. అయితే తేలు సంగతి తెలిసిన కప్ప తన వీపుపై కూర్చోబెట్టుకొని తీసుకువెళ్లేందుకు సంశయించింది. అయితే తేలు కుట్టనని, ఎలాంటి ఇబ్బందిపెట్టనని, కప్పను బతిమిలాడింది. పాపం అనుకున్న కప్ప తన వీపుపై తేలును కూర్చోబెట్టుకొని చెరువు ఒడ్డుకు చేర్చింది. అయితే తేలు తన సహజ లక్షణాన్ని విడువకుండా ఒడ్డుకు చేరగానే కప్ప వీపుపై కుట్టింది. దీంతో కప్ప విషం తట్టుకోలేక చనిపోయిందంటూ కవిత కథ చెప్పారు. ఈ కథలో తేలు కాంగ్రెస్ పార్టీ అని, ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ పార్టీ వారిని ఇబ్బందుల పాలు చేస్తుందని ఆమె పేర్కొనడంతో ప్రజలందరూ చప్పట్లు కొట్టారు.

### కార్యకర్తలు సమష్టిగా కృషిచేయాలి



ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ రాయికల్ పట్టణం, రాయికల్ మండలాన్ని ఎంతో అభివృద్ధి చేసిండు. రెండోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తడు. అభివృద్ధి ఎవరు చేస్తరు.. ఎవరితో మేలైతదని అని ప్రజలు ఆలోచించి ఓటేయాలి. ఎవరేమన్నా.. రాష్ట్రంలో బీఆర్ఎస్ సర్కారు మూడో సారి అధికారంలోకి రావడం, కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం ఖాయం. రెండో సారి సంజయ్ ఎమ్మెల్యేగా గెలువడం తథ్యం. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏమరపాటుగా ఉండొద్దు. సమష్టిగా కృషి చేస్తేనే ఇది సాధ్యమవుతుంది.

**- ఇటిక్యాల కార్నర్ మీటింగ్‌లో ఎమ్మెల్సీ ఎల్ రమణ**

### సంజయ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి



ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైంది. ఎన్నికల సమయంలో ఓటర్లు ఆలోచించి పనిచేసే ప్రభుత్వానికే ఓటు వేయాలి. గత ప్రభుత్వాల హయాంలో కరంటు లేక చీకట్లో మగ్గితే రాష్ట్రం నేడు వెలుగుల్లో ప్రయాణిస్తుంది. గతంలో రైతులు పడ్డ ఇబ్బందులను గుర్తు చేసుకుని ఈ ఎన్నికల్లో అభివృద్ధి చేసిన కారు గుర్తుకే ఓట్లు వేయాలి. జగిత్యాల ఎమ్మెల్యేగా డాక్టర్ సంజయ్‌కుమార్‌ను మల్లోసారి భారీ మెజార్టీతో గెలిపించాలి.

**- ఇటిక్యాల కార్నర్ మీటింగ్‌లో జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత**

## కాంగ్రెస్ నాయకులు చెప్పేవన్నీ అబద్ధాలే

కాంగ్రెస్ పార్టీ ఆ నాయకులు ఎప్పుడూ అబద్ధాలే చెబుతరు. రాహుల్ గాంధీ మొహబ్బత్ దుకాణ్ అంటే.. రేటెంత రెడ్డి టికెట్ల దుకాణం తెరిచిండు. కోట్ల రూపాయలకు టికెట్లు అమ్ముకున్నడని కాంగ్రెస్ నాయకులే రేటెంత రెడ్డిని తిడుతున్నరు. జగిత్యాలలో జీవన్ రెడ్డి చెప్పేవన్నీ అబద్ధాలే. జగిత్యాల టౌన్ మాస్టర్ ప్లాన్‌ని రద్దు చేశాం ఆయన ప్రజలను మభ్యపెడుతున్నడు. రూపాయలు వెయ్యి కోట్లతో జగిత్యాల పట్టణాన్ని అభివృద్ధి చేసినం. జగిత్యాలలో 4500 డబల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించినం. 3700 ఇండ్లను పంపిణీ చేసినం. సంజయ్ అన్నను గెలిపిస్తే మరో వెయ్యి ఇండ్లను కేసీఆర్‌తో మాట్లాడి మంజూరు చేయిస్త. జగిత్యాల అభివృద్ధిపై ఏ క్షణమైనా చర్చించేందుకు సిద్ధం. జీవన్ రెడ్డికి దమ్ముంటే సంజయ్ అన్నతో జగిత్యాల అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని నేను సవాల్ చేస్తున్న. జగిత్యాల ప్రజలారా ఒక్కసారి ఆలోచించాలి. మైనార్టీ సోదరులు కూడా ఆలోచించాలి. మెరిసేదంతా బంగారం కాదు, కాంగ్రెస్ చెప్పేవన్నీ అబద్ధాలే. వాటిని నమ్మి మోసపోకండి. ఒకప్పుడు తెలంగాణలో ఎలాంటి పరిస్థితులు ఉన్నయి. ఇప్పుడు ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో చూడండి. ఒకనాటి భూముల ధరకు నేటి భూముల ధరకు ఉన్న వ్యత్యాసాన్ని పరిశీలించండి. రానున్న ఎన్నికల్లో జగిత్యాలలో సంజయ్ అన్నను గెలిపించండి. కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా చేయండి.

**-జగిత్యాల మంచినీళ్ల వద్ద రోడ్‌షోలో కల్వకుంట్ల కవిత**

## ఎమ్మెల్సీ కవితకు స్వల్ప అస్వస్థత

- రాయికల్ రోడ్‌షోలో ఘటన
- పది నిమిషాల తర్వాత కోలుకుని ప్రసంగం
- తన ఆరోగ్యం బాగానే ఉందని ఎక్స్ (ట్విటర్‌లో) పోస్ట్

జగిత్యాల, నవంబర్ 18, (నమస్తే తెలంగాణ) : జగిత్యాల బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కుమార్ మద్దతుగా నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శనివారం ప్రచారం చేశారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల దాకా రాయికల్ మండలం మైతాపూర్, ఇటిక్యాల, భూపతిపూర్, తాట్లవాయి, కట్కాపూర్, బీర్‌పూర్, అల్లీపూర్, రాయికల్‌తోపాటు జగిత్యాలలో నిర్వహించిన రోడ్‌షోల్లో పాల్గొన్నారు. అయితే ఆమె రాయికల్ మండలంలోని ఇటిక్యాలలో స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఇటిక్యాలలో కవితకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఆమె ఓపెన్‌టాప్ జీప్‌లో ఉండి అభివాదం చేశారు. కూడలి వద్ద ఎమ్మెల్సీ ఎల్ రమణ, అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్ ప్రసంగించారు. అనంతరం జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతుండగానే.. వేదికపై ఉన్న ఎమ్మెల్సీ కవిత డిహైడ్రేషన్‌కు గురై హఠాత్తుగా కూర్చుండిపోయారు. దీంతో అక్కడున్న ప్రజలు ఆందోళనకు గురయ్యారు. వేదికపైనే ఉన్న స్వతహాగా వైద్యులైన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, అభ్యర్థి సంజయ్‌కుమార్ చిన్నపాటి వైద్యం చేశారు. పది నిమిషాల తర్వాత కవిత కోలుకొని రోడ్డుషోలో ప్రసంగించారు.

## నా ఆరోగ్యం బాగానే ఉంది..

- పసిబిడ్డతో ఆడుకోవడం రిలాక్స్‌నిచ్చింది
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ఇటిక్యాల రోడ్ షోలో డిహైడ్రేషన్‌కు లోనై అస్వస్థతకు గురైన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన ఆరోగ్యం బాగానే ఉందని, ఎవరూ ఆందోళన చెందవద్దని ఎక్స్‌లో (ట్విటర్) పోస్ట్ చేశారు. ఇటిక్యాల రోడ్డుషో ముగిసిన అనంతరం అదే గ్రామంలో ఒక బీఆర్ఎస్ నాయకుడి ఇంట్లో కాసేపు సేదతీరారు. అదే సమయంలో ఆమె తన ఆరోగ్యంపై పోస్ట్ చేశారు. డిహైడ్రేషన్ వల్ల కొంత అసౌకర్యం అనిపించిందని, ఆరోగ్యానికి ఇబ్బంది లేదని చెప్పారు. సేద తీరుతున్న సమయంలో రాయికల్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కొల్లూరి వేణు కూతురు, చిన్నారి వెరోనికాతో ఆడుకున్నానని, పసిబిడ్డతో ఆడుకోవడం, ఆహ్లాదాన్ని, రిలాక్స్‌ను ఇచ్చిందని, ఆ ఉత్సాహంతో రోడ్డులో పాల్గొంటున్నానని ఆమె చెప్పారు.